క్లుప్తంగా

నూజివీడు డివిజన్‌లో 343.4 మి.మీ. వర్షపాతం నమోదు

నూజివీడు: డివిజన్‌లోని ఆరు మండలాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 343.4 మిల్లీ మీటర్ల భారీ వర్షపాతం నమోదైందని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం తెలిపారు. అత్యధికంగా లింగపాలెం మండలంలో 116.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా అత్యల్పంగా చింతలపూడి మండలంలో 27.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. నూజివీడు మండలంలో 72.2 మి.మీ, ఆగిరిపల్లిలో 46.4 మి.మీ, ముసునూరులో 40.6 మి.మీ, చాట్రాయిలో 39.8 మి.మీ. వర్షపాతం నమోదైందని చెప్పారు.

ముగిసిన యోగా శిక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆర్యవైశ్య వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నెల రోజులుగా నిర్వహించిన యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. క్లబ్ అధ్యక్షుడు శంకర దినేష్ మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ సాధకులకు సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం నేర్పించారు.

సీతారాం ఏచూరికి నివాళి

తిరువూరు: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం తిరువూరు సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్, సానికొమ్ము నాగేశ్వరరెడ్డి తదితరులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా ఉద్యమాల్లో ఏచూరి పాత్రను వక్తలు వివరించారు.

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం సోమవారం ఏర్పాటు చేశామని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాయల అరుణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ మల్టీ హాల్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీపతి హోమియో క్లినిక్ నూజివీడుకు చెందిన హోమియో వైద్య నిపుణులు కృష్ణప్రసాద్ రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని చెప్పారు.

ఖాళీస్థలాలు.. వ్యాధులకు నిలయాలు

దినదినాభివృద్ధి చెందుతున్న మేజర్ గ్రామ పంచాయతీ మైలవరాన్ని ఖాళీ స్థలాల సమస్య వేధిస్తోంది. ఉద్యోగులు, ఇతర దేశాలలో ఉంటున్న సమీప గ్రామాల ప్రజలు స్థిరాస్థి కోసం కొని ఉంచిన ఖాళీ నివేశన స్థలాలు నిర్వహణా లోపంతో పిచ్చిచెట్లు పెరిగి పందులు, కుక్కలు, కోతులు, విష పురుగులకు అవాసాలుగా మారుతున్నాయి. వ్యర్థాలను ఖాళీ స్థలాల్లో పడవేయడంతో డంపింగ్ యార్డుల్లా మారి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి.

- ఇళ్ల మధ్య అధికంగా ఖాళీ స్థలాలు
- పిచ్చిమొక్కలు, మురుగుతో నిండిన వైనం
- కోతులు, కుక్కలు, విష పురుగులకు ఆవాసాలు
- దోమల విజృంభణతో విస్తరిస్తున్న వైరల్ ఫీవర్లు



ఖాళీ స్థలంలో వ్యర్థాలతో నిండిన మురుగునీరు



మైలవరంలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిచెట్లు

జి.కొండూరు: భారీ వర్షాలు పడినప్పుడు వర్షం నీరు ఖాళీ స్థలాల్లో చేరి నిల్వ ఉండడంతో మురుగునీరుగా మారి దోమ లార్వా వృద్ధి చెంది దోమలు విజృంభిస్తున్నాయి. నిల్వ ఉన్న నీటి నుంచి వచ్చే దుర్వాసన స్థానికులకు ఇబ్బందిగా మారుతోంది. కొందరైతే ఖాళీ స్థలాలను ఏకంగా పేడ దిబ్బలకు వినియోగిస్తుండటం మరో సమస్యగా మారింది. వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి.

ఖాళీ ఇళ్ల స్థలాలే ఎక్కువ

మైలవరం అభివృద్ధి చెందుతుండటంతో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రపోజల్ కూడా పంపి ఉన్న నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, ఎన్ఆర్ఐలు ఇబ్బడిముబ్బడిగా ఇళ్ల స్థలాలను కొనుగోలు చేశారు. గతంలో గజం ధర రూ.5 వేలు ఉండగా ప్రస్తుతం గజం ధర రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు ఉండడంతో భవిష్యత్‌లో ఇంకా ధర పెరిగే అవకాశం ఉందని భావించి ఎటువంటి కట్టడాలు చేయకుండా అలానే ఉంచుతున్నారు. ఖాళీ స్థలాలను ఏడాదికి ఒక్కసారైనా శుభ్రం చేయడం, ఫెన్సింగ్ వేయించుకోవడం, లోతుగా ఉన్న స్థలాలను మెరక చేయడం వంటి చర్యలు చేపడితే ఎటువంటి సమస్య తలెత్తకుండా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

సమస్యగా మారిన యజమానుల గుర్తింపు

ఖాళీ స్థలాల వల్ల పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోందని మీడియాలో కథనాలు వస్తున్న క్రమంలో ఈ స్థలాల యజమానులను గుర్తించడం గ్రామ పంచాయతీ అధికారులకు సవాలుగా మారింది. ఒక్కొక్క స్థలం క్రయవిక్రయాలు జరిగి నలుగురైదుగురు చేతులు మారడంతో అసలు యజమాని ఎక్కడ ఉన్నాడో గుర్తించడం సమస్యగా మారింది. ఖాళీ స్థలాలను శుభ్రపరచడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో చేసేది లేక గ్రామ పంచాయతీ అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు. దీనితో స్థానికంగా నివాసం ఉండే ప్రజలు నరకయాతన పడుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



మైలవరంలో ఖాళీ ఇళ్ల స్థలాలు తలనొప్పిగా మారాయి. ఈ స్థలాల్లో వేసిన వ్యర్థాల కోసం వచ్చిన కోతులు, పందులు, కుక్కలు స్వైర విహారం చేసి చెల్లాచెదురుగా చేయడం వల్ల దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు పెరిగి నరకయాతన పడుతున్నాం. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి మరలా వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– చెరుకు గణేష్‌రెడ్డి, గ్రామస్తుడు, మైలవరం

స్పెషల్ డ్రైవ్ చేపట్టాం



మైలవరంలో పారిశుద్ధ్య చర్యలను ఎప్పటికప్పుడు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం. గతంలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాం. యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మహ్మద్ రఫీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మైలవరం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిచవచ్చన్నారు.

ఘనంగా జాతీయ హిందీ భాషా దినోత్సవం

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆదివారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. భారతదేశ అధికార భాషగా మార్చడానికి కృషి చేసిన రాజేంద్ర సింహా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు వూటుకూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ సోమవారం లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం కొండపల్లిలో జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. 15 మందితో పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జి.కొండూరు: కవులూరులో ధన్వంతరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు శ్రీవాణి, ఈశ్వర్, పవన్ పర్యవేక్షణలో 90 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులను అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు హనుమంతరావు, రామారావు, రాజేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

- తిరువూరు: వికాస తరంగిణి ఆధ్వర్యంలో గంపలగూడెంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకర హాస్పిటల్ వైద్యులు కట్టమూడి హరీష్, తిరువూరు సుమన్ ఆస్పత్రి వైద్యులు కార్తీక, యార్లగడ్డ దుర్గాప్రసాద్, పాతూరి పద్మావతి 350 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు సముద్రాల జ్యోతి, ఉపాధ్యక్షురాలు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

తిరువూరురూరల్: ఇటీవల అనారోగ్యానికి గురైన తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆదివారం పరామర్శించారు. మునుకుళ్లలోని ఆయన నివాసంలో స్వామిదాసుతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి ముక్కామల సీతారామయ్య, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు వెదురు గోపిరెడ్డి, నాయకులు పదిలం శ్రీనివాసరావు పరామర్శించారు.

రామకృష్ణ కుటుంబానికి..

ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రమాదవశాత్తు మరణించిన వామకుంట్ల గ్రామానికి చెందిన పెదగమల్ల రామకృష్ణ కుటుంబాన్ని నల్లగట్ల స్వామిదాసు తదితరులు పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు. అదే గ్రామంలో వినాయక నిమజ్జన సమయంలో ప్రమాదానికి గురైన పంది వెంకటనారాయణను కూడా పరామర్శించారు.

బంజారా సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలాజీ నాయక్



బాలాజీ నాయక్‌ను అభినందిస్తున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిలేశపురం గ్రామానికి చెందిన దారావత్ బాలాజీ నాయక్ నియమితులయ్యారు. గుంటూరులో ఆదివారం జరిగిన బంజారా సేవా సంఘం రాష్ట్ర సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణావతి చక్రి నాయక్, ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు నాయక్‌లు బాలాజీ నాయక్‌కు నియామకపత్రం అందజేశారు. బాలాజీ నాయక్‌ను జిల్లా అధ్యక్షుడు కేతావత్ లాలియా నాయక్, కార్యదర్శి బాణావత్ శ్రీనివాస్ నాయక్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ బాలాజీ నాయక్ అభినందించారు.

ఉత్తమ రైతు పురస్కారం ప్రదానం



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడి రైతు యనమదల వెంకట శ్రీనివాసరావు (స్వామి)కు ఉత్తమ రైతు పురస్కారం లభించింది. హైదరాబాద్‌కు చెందిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావును ఉత్తమ రైతు పురస్కారంతో సత్కరించారు. రిటైర్డ్ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

నేడు బూడిద సమస్యపై అధికారులకు వినతిపత్రాలు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద లోడింగ్‌పై నెలకొన్న స్థానిక లారీ ఓనర్ల సమస్యపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందజేసే కార్యక్రమం సోమవారం జరుగుతుందని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్, లారీ ఓనర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగర సీపీ రాజశేఖరబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్ సౌధాలోని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పొంగుతున్న వాగులు



చాట్రాయి: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రేగడి వాగు, ఉప్పు వాగుల్లో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కొత్తగూడెం, యర్రవారిగూడెం, చాట్రాయి, జనార్దనవరం గ్రామాల మధ్య ఉప్పు వాగులో వరద ప్రవహిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం వరకు రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షానికి చెరువుల్లో నీరు చేరింది.